# జీవస్వరం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి - 5 | అక్టోబర్ - 2021 | సంచిక - 4

"భారముచే అలసి సొలసి యున్న సమస్త జనులారా!
నా యొద్దకు రండు మీకు విశ్రాంతి నొసగుదును"
(మత్తయి 11,28)



దేవుని పుత్రుల స్వాతంత్ర్యం

# కారుణ్యనిధి మెడికల్ షాప్, మంచిర్యాల






ఆదిలాబాద్ మేత్రాసన ధర్మదాయ
కార్యక్రమాలకు చేయూత

అందరికి న్యాయబద్ధమైన ధరలో
అన్ని రకాల మందులు











సంపుటి - 5 అక్టోబర్ - 2021 సంచిక-4

# జీవస్వరం

ఆధ్యాత్మిక మాస పత్రిక


తండ్రి గారి సందేశం.......................................3

దేవుని ఆలయం.......................................6

శోధన.......................................8

బైబిల్ దర్శనం .......................................10

పునీత జాన్ కపిస్త్రానో.......................................12

శుభవచనం బైబిల్ క్విజ్.......................................15

ఇంద్రధనుస్సు.......................................17


ఏంజెల్స్ కార్నర్.......................................18

యువస్పందన.......................................19

బైబిల్ దృశ్యమాలిక.......................................21


శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు.......................................23










**ముద్రణానుమతి**

**బిషప్ ప్రిన్స్ అంతోని గారు**

**ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు**



**సంపాదక వర్గం**

ఫాదర్ సిజో | ఫాదర్ ప్రిన్స్

సిస్టర్ హృదయ ASMI | సిస్టర్ క్రిస్టీన CMC

Mr. M. సత్యం | Mr. J. లూర్థు స్వామి

Mrs. K. శ్రీలత | Mr. కిరణ్ కుమార్ రెడ్డి

**టైపింగ్ సహకారం** – D. ప్రిన్సి



**జీవస్వరం**
**బిషప్స్ హౌస్**
మంచిర్యాల- 504 208
మంచిర్యాల జిల్లా
తెలంగాణ

Cell: 09398764408

Email ID - jeevaswarammagazineadb@gmail.com

**Jeevaswaram**
**Bishop's House**
Mancherial - 504 208
Mancherial Dist
Telangana State

**"సర్వశక్తిమంతుడవైన ప్రభూ! నీ నివాసము ఎంత రమ్యము! నేను ప్రభువు మందిరావరణములను దర్శింపవలెనని ఉవ్విళ్లూరుచున్నాను, తపించిపోవుచున్నాను. పూర్ణ హృదయముతోను, ఆనందముతోను నేను సజీవుడైన దేవునికి గీతములు పాడుదును".**

**(కీర్తన 84,1-2)**

ఆగస్టు నెల
శుభవచనం బైబిల్ క్విజ్ విజేతలు

మొదటి బహుమతి
ఎస్. కాంతమ్మ, రేపల్లివాడ
రెండవ బహుమతి
పి. పుష్ప, బెల్లంపల్లి
మూడవ బహుమతి
డి. జోసఫ్‌రాజ్, జెండా వెంకటాపూర్

బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి

ఆగస్టు నెల
ఇంద్రధనుస్సు విజేతలు

మొదటి బహుమతి
ఎమ్. బ్లెస్సీ, సాలిగాం
రెండవ బహుమతి
ఆర్. రితీష్, ఆదిలాబాద్
మూడవ బహుమతి
ఎ. రామ్‌చరణ్, సిర్పూర్

బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి

# తండ్రి గారి సందేశం....



## మారు మనస్సు లేని విశ్వాస ప్రకటనను ఇష్టపడని యేసు ప్రభువు

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

విశ్వాస ప్రకటన మరియు మారు మనస్సు ఏ విధంగా ముడిపడి ఉన్నాయో అని యేసు ప్రభువు దుష్టాత్మను వెడలగొట్టిన అద్భుతము (మార్కు సువార్త 1,21-28) ఆధారంగా మనం ధ్యానిద్దాం.

ఈ అద్భుతం జరిగిన రోజు సబ్బాతు దినం. యూదులకు సబ్బాతు దినం (విశ్రాంతి దినం) ప్రధానమైన రోజు. ఆ రోజును ప్రార్థనకు, విశ్రాంతికి మాత్రమే కేటాయించేవారు. వారి నియమము అనుసరించి ప్రాయం కలిగిన పురుషులందరూ ప్రార్థన మందిరమునకు వెళ్ళేవారు. పరిశుద్ధ లేఖనాలను చదివిన తరువాత బోధకుడుగాని, ప్రార్థన మందిరపు అధికారి కాని ప్రసంగించేవారు. ప్రార్థన మరియు ఆశీర్వాదము తరువాత అందరూ తిరిగి ఇంటికి వెళ్ళేవారు. కాని ఈ సంఘటన జరిగిన రోజు ప్రార్థన కార్యక్రమాలు సరిగా కొనసాగలేదు అని ఈ సువార్త భాగంలో చూస్తున్నాము.

ఆ సబ్బాతు రోజున నజరేతు నివాసియైన యేసు ప్రసంగించారు. నజరేతు గ్రామం కఫర్నాము పట్టణము నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉంది. యేసు ప్రభు ప్రసంగించిన ఆ ప్రార్థన మందిరం కఫర్నాములో ఉంది. ఈ ప్రదేశములకు మధ్య ఉన్న దూరం తక్కువైనందుకు యేసు ప్రభువును గురించి కఫర్నాములోని వారికి తెలిసియుండవచ్చు. యేసు యూదుల ధర్మశాస్త్రంలో ప్రావీణ్యం పొందలేదని వారికి తెలుసు. అయినప్పటికీ, యేసు ప్రభు యూదుల ధర్మశాస్త్రం గురించి అధికారికంగా ప్రసంగించటం వారు విన్నారు. ఆ విధంగా ప్రసంగిస్తున్న సమయంలో అపవిత్రాత్మ ఆవేశించిన ఒకడు కేకలు వేస్తూ "నజరేతు నివాసియగు యేసు! మాతో నీకేమి పని? మమ్ము నాశనము చేయ వచ్చితివా? నీవు ఎవరివో నేనెరుగుదును. నీవు దేవుని పవిత్రమూర్తివి" (మార్కు 1,24) అని అరిచాడు. దీనిని విన్నవారందరూ దిగ్భ్రాంతికి గురి అయ్యారు.

ప్రతిసారి ప్రార్థన మందిరమునకు వచ్చే దయ్యం పట్టిన వ్యక్తిని గురించి వారందరికి తెలిసియుండవచ్చు. ప్రార్థనా సమయంలో మౌనంగా ఉండి ఆరాధించే ఈ వ్యక్తి అకస్మాత్తుగా కేకలు వేయటం ఆశ్చర్యానికి గురిచేసింది. ఆ వ్యక్తికి అపవిత్రాత్మ పట్టిందని వారు గ్రహించారు. అపవిత్రాత్మ పట్టిన వ్యక్తి "నీవు దేవుని పవిత్ర మూర్తివి" అని అనటం ద్వారా యేసు ప్రభు దేవుని కుమారుడని ఆయన ప్రకటిస్తున్నాడు. దైవ రాజ్యాన్ని స్థాపించడానికి మరియు సాతానుకు ఈ లోకంపై యున్న అధికారాన్ని అంతమొందించడానికి యేసు ప్రభువు ఈ భూలోకానికి వచ్చాడని ఆ వ్యక్తికి తెలుసు. ఇది నిజంగా విశ్వాస

ప్రకటనే. ఆయన తన విశ్వాసాన్ని ప్రకటించాడు. కాని యేసు ప్రభువు అతనిని మాట్లాడవద్దని ఆదేశించాడు. ఎందుకు యేసు ప్రభువు అతనితో "నోరు మూసుకొని వీని నుండి వెడలిపొమ్ము" అని అన్నారు. ఎందుకు యేసు అపవిత్రాత్మ పట్టిన వ్యక్తిని నిశ్శబ్దంగా ఉండమని ఆదేశించారు. మార్కు సువార్తలో, చాలా మంది వ్యక్తులను యేసు తన గురించి ప్రకటించవద్దని ఆదేశిస్తున్నారు. స్వస్థత పొందిన వారితో వారు పొందిన స్వస్థతను గురించి చెప్పవద్దని, తాను చేసిన పనులను బయలు పరచవద్దని యేసు ప్రభు ఆదేశించారు. ఎందుకు యేసు ప్రభువు ఈ విధంగా చేస్తున్నారు? మార్కు సువార్త మనకు నేర్పించే ఒక సత్యం ఉంది. మారు మనస్సును, పశ్చాత్తాపాన్ని కలిగించని ఏ విశ్వాస ప్రకటనైనా అర్థరహితం. మారు మనస్సును కలిగించని ఏ విశ్వాస ప్రకటన యేసు ప్రభుకు నచ్చదు. దాని వల్ల ఏ ఉపయోగం ఉండదు.

యేసు ప్రభు తన శిష్యులతో ఆ దివ్యరూప ధారణను గురించి తన పునరుత్థానం వరకు ఎవ్వరితో చెప్పవద్దని ఆదేశించారు (మార్కు 9,9) యేసు ప్రభువు మరణం మరియు పునరుత్థానం ద్వారా మాత్రమే యదార్థమైన యేసు ప్రభుని వ్యక్తిత్వాన్ని మనం గ్రహించవచ్చు. యేసు ప్రభు చేసిన అద్భుతాలు, ఆయన చేసిన బోధనలు యేసు ప్రభుని యదార్థమైన వ్యక్తిత్వాన్ని మనకు అందించాయి. కాని వాటి ద్వారా మనకు తెలిసిన సత్యం సగం మాత్రమే. యేసు ప్రభువును నిజంగా, యథార్థంగా, సంపూర్ణంగా తెలుసుకోవాలంటే ప్రతి ఒక్కరు తన సిలువనెత్తుకొని ఆయన వెంబడి నడిచి సిలువ చెంతకు చేరాలి. ఈ విషయాన్ని మార్కు గారు శతాధిపతి ద్వారా మనకు తెలియ జేస్తున్నారు. సిలువ క్రింద ఉన్న శతాధిపతి తన విశ్వాసాన్ని ప్రకటిస్తున్నారు. "యేసు ప్రాణము విడుచుటను చూచి అచట నిలిచియున్న శతాధిపతి 'నిస్సందేహముగా ఈయన దేవుని కుమారుడే' అని పలికెను" (మార్కు 15, 39).

మారు మనస్సులేని విశ్వాస ప్రకటన, సిలువను మోసుకొని వెంబడించలేని బహిరంగ విశ్వాస చాటింపు యేసు ప్రభు దృష్టిలో విలువలేనివి. అందుకనే యేసు ప్రభువు అపవిత్రాత్మ పట్టిన వ్యక్తిని నిశ్శబ్ధంగా ఉండమని ఆదేశించాడు. అపవిత్రాత్మ పట్టిన వ్యక్తి ప్రకటించింది నిజమైన విశ్వాస సత్యం. ఆ యదార్థమైన విశ్వాస సత్యం మారు మనస్సు కలిగించకపోతే ఎందుకు పనికిరాదు. దేవుని రాజ్యాన్ని స్థాపించడం మరియు మానవుని దేవునితో సఖ్యపరచడం కొరకు యేసు ప్రభువు ఈ భూలోకానికి వచ్చాడు. అలా కాకుండా యేసు ప్రభువు ఈ భూలోకంలో చేసిన అద్భుతాలు అందరు తెలుసుకోవాలని, తద్వారా తనను రాజుగా అందరు పొగడాలని ఆయన అనుకోలేదు. భౌతికమైన రాజ్యాన్ని స్థాపించడం కొరకు లేదా భౌతికమైన గౌరవమర్యాదలు పొందడానికి యేసు ప్రభు రాలేదు. ఒక వ్యక్తి పశ్చాత్తాపపడి సువార్తను విశ్వసించి యేసును వెంబడించినప్పుడే విశ్వాస ప్రకటనకు అర్థం ఉంటుంది. అపవిత్రాత్మలు కూడా యేసు ప్రభువును విశ్వాసించాయి. యేసు ప్రభువు గొప్పతనం గురించి మనకంటే వాటికి ఎక్కువ తెలుసు. మన విశ్వాసం కన్నా వాటి విశ్వాసం చాలా గొప్పది. "దేవుడు ఒక్కడేనని నీవు విశ్వసింతువు గదా? మంచిదే! పిశాచములును విశ్వసించును. భయముతో గజగజలాడును" (యాకోబు 2,19) కాబట్టి నోటి ద్వారా మనం ప్రకటించేది మారు మనస్సు ద్వారా, మన చేతల ద్వారా, సాక్ష్యం ద్వారా నిరూపింపబడాలి.


కేవలం ప్రకటించడమే యేసు ప్రభువు కోరుకున్నట్లయితే మారు మనస్సుకు, సిలువ మరణానికి అర్థం ఉండదు. కాబట్టి బహిరంగ విశ్వాస ప్రకటనతో సహ పశ్చాత్తాపం కలిగిన జీవితం, అందరితో కలిసి మెలసి ఉండే జీవితం, దేవునితో సఖ్యపడే జీవితం లేకపోయినట్లయితే విశ్వాస ప్రకటనకు అర్థం ఉండదు. కాని పైన చెప్పిన ఏవి లేకుండా కేవలం గొంతెత్తి విశ్వాసాన్ని ప్రకటిస్తానంటే యేసు ప్రభు మనతో కూడా “నోరుమూసుకోమని” (మార్కు 1,21) హెచ్చరిస్తారు. మనం ఆత్మ పరిశీలన చేసుకుందాం. మారు మనస్సు పొంది విశ్వాసములో ఎదిగి ధైర్యముతో విశ్వాసాన్ని ప్రకటిద్దాం.

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి

**బిషప్ ప్రిన్స్ అంతోని**

ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు



## ధ్యాన కేంద్ర నిర్మాణము కొరకు ప్రార్థన

ప్రభువా, నీ నామ మహిమ కొరకు మరియు ఆదిలాబాద్ గురుపీఠంలో సువార్త వ్యాప్తి కొరకు నిర్మించబడుతున్న ధ్యానకేంద్రాన్ని ఆశీర్వదించండి. ఎటువంటి ఆటంకములు లేకుండా దానిని సకాలంలో పూర్తి చేయుటకు తద్వారా మీ సువార్తను ప్రకటించుటకు మాకు అనుగ్రహం దయచేయమని ప్రార్థించుచున్నాము. ఆమెన్.



# దేవుని ఆలయం

1. "పగలు త్రోవచూపు మేఘస్తంభముగా, రాత్రి వెలుగు ఇచ్చు అగ్నిస్తంభముగా ప్రభువు యిస్రాయేలీయుల ముందు నడచెను. ఆ విధముగా వారు పగలు రేయి ప్రయాణము చేసిరి" (నిర్గమ 13,21).

2. "మోషే గుడారమును తీసికొనివెళ్లి శిబిరముకు కొంచెము దూరమున పన్నెడివాడు. అతడు దానికి సమావేశపు గుడారమని పేరిడెను. ప్రభువును సంప్రతింప దలచుకొన్నవారు పాళెమునకు వెలుపల నున్న ఆ గుడారమునకు వెళ్లెడివారు" (నిర్గమ 33,7).

3. "నేను యిస్రాయేలీయుల నడుమ వసింతును. వారికి దేవుడనై ఉందును" (నిర్గమ 29,45).

4. "పని వాండ్రు దేవాలయమునకు పునాదులు వేయుచుండగా యాజకులు అర్చన వస్త్రములు తాల్చి, చేత బాకాలు పూని చెంత నిలుచుండిరి. ఆసాపు గోత్రీకులైన లేవీయులు చేతి తాళములతో ప్రక్కన నిలుచుండిరి. వారు దావీదు రాజు సంప్రదాయము చొప్పున ప్రభువును స్తుతించిరి" (ఎజ్రా 3,10)

5. "నీవు రోజులు నిండి నీ పితరులను కలిసికొనిన పిమ్మట నీ మేని నుండి వెలువడిన తనయునే నా రాజ్యమునకధిపతిని చేసెదను. అతని యేలుబడిని ధ్రువపరచెదను" (2 సమూవేలు 7,12).

6. మా తండ్రి దావీదు యిస్రాయేలు దేవుడైన ప్రభువు నారాధించుటకు దేవాలయమును కట్టింపగోరెను". (2 రాజుల దినచర్య 6,7)

7. "యెబూసీయుడు ఒర్నాను అనువాని కళ్లమున దేవుడు దావీదుకు దర్శనమిచ్చెను. ఆ తావు యెరూషలేములోని మోరీయా కొండ మీద ఉన్నది. ఆ స్థలమును దావీదు దేవాలయ నిర్మాణముకు సిద్ధము చేసెను. సొలోమోను

తన పరిపాలనాకాలము నాల్గవ యేట, రెండవ నెల, రెండవ దినమున ఆ తావుననే దేవాలయ నిర్మాణము ప్రారంభించెను" (2 రాజుల దినచర్య 3,1-2).

8. "సొలోమోను ప్రార్థన ముగించగానే ఆకాశము నుండి అగ్ని దిగివచ్చి బలి నైవేద్యములను దహించెను. ప్రభువు తేజస్సు గుడారమును నింపెను"
(2 రాజుల దినచర్య 7,1).

9. "అతడు కుమారుని పిలిపించి యిస్రాయేలు దేవుడైన ప్రభువుకు మందిరము కట్టవలయునని ఆదేశించెను" (1 రాజుల దినచర్య 22,6).

10. "నేను ప్రభువును ఒక్క వరము కోరుకొంటిని. నాకు కావలసినది ఇది ఒక్కటియే. నా జీవిత కాలమంతయు ప్రభు మందిరమున వసింపవలెననియు, ఆయన సౌందర్యమును గాంచవలెననియు దేవాలయమున ఆయన సలహా అడుగుకోవలెననియు నా కోరిక"
(కీర్తన 27,4).

11. "నేను మిమ్ము నా పవిత్ర పర్వతమునకు కొనివత్తును. నా ప్రార్థనా మందిరమున మిమ్ము సంతోష చిత్తుల గావింతును. నా బలిపీఠముపై మీరర్పించు బలులను, దహన బలులను స్వీకరింతును. నా మందిరము సకల జాతి జనులకు ప్రార్థనా మందిరమని పిలువబడును" (యెషయా 57,7).

12. "ప్రభువు ఇట్లనుచున్నాడు. ఆకాశము నాకు సింహాసనము. భూమి నాకు పాదపీఠము. మీరు నాకెట్టి మందిరము కట్టుదురు? (యెషయా 66,1-2).

13. "మా పూర్వులు స్వర్గాధిపతియైన దేవునికి కోపము రప్పించుట వలన అతడు కల్దీయ రాజ వంశీయుడు బబులోనియా రాజు నెబుకద్నెసరుకు వారు లొంగి పోవునట్లు చేసెను. ఆ రాజు వారి దేవళమును పడగొట్టి వారిని బబులోనియాకు చెరగొని పోయెను'' (ఎజ్రా 5,12).

14. "కోరెషురాజు తన యేలుబడి మొదటి యేట ఈ శాసనము చేసెను. యెరూషలేము దేవాలయమును పునర్నిర్మింపవలయును. అచట బలులు, దహన బలులు అర్పింప వచ్చును. ఆ మందిరము ఎత్తు తొంబది అడుగులు, వెడల్పు తొంబది అడుగులు ఉండవలెను" (ఎజ్రా 6,3).

15. "ప్రభువు తేజస్సు తూర్పు ద్వారము నుండి దేవాలయమును ప్రవేశించెను" (యెహెజ్కేలు 43,4).

16. "ఈ ప్రపంచమును దానిలోని సమస్తమును సృజించిన దేవుడే, పరలోకమునకు, భూలోకమునకు ప్రభువు. ఆయన మానవ నిర్మితమైన ఆలయములో నివసింపడు". (అపోస్తలుల కార్యములు 17,24).

17. "దేవుని ఆలయము, అవిశ్వాసుల విగ్రహములతో ఎట్లు ఏకీభవింపగలదు? ఏలయన, మనమే సజీవుడగు దేవుని ఆలయము గదా? "నేను నా నివాసమును వారితో ఏర్పరచుకొందును, వారి మధ్యనే జీవింతును. నేనే వారికి దేవుడనగుదును, వారు నా ప్రజలగుదురు" అని దేవుడే స్వయముగ పలికెను గదా?" (2 కొరింతీ 6,16).


18. "ఈ ఆలయమును మీరు పడగొట్టుడు. నేను దీనిని మూడు రోజులలో లేపుదును" అని వారికి సమాధాన మిచ్చెను" (యోహాను 2,19).

19. "కాని, వాస్తవముగ ఆయన పలికినది తన శరీరము అను ఆలయమును గురించియే" (యోహాను 2,21).

20. "మీరు దేవుని ఆలయమని, దేవుని ఆత్మకు నివాసమని మీకు తెలియదా?" (1 కొరింతీ 3,16).

21. ఆధ్యాత్మిక దేవాలయమును నిర్మించుటలో సజీవశిలలుగ మిమ్ము ఉపయోగింపనిండు. యేసు క్రీస్తు ద్వారా, ప్రీతికరమైన ఆధ్యాత్మికమగు బలులను దేవునకు అర్పించుటకు మిమ్ము పవిత్రమైన యాజకులుగ చేయనిండు (1 పేతురు 2,5)

22. క్రీస్తు యేసు మూలరాయిగా అపోస్తలుల చేతను ప్రవక్తల చేతను వేయబడిన పునాదిపై మీరును నిర్మింపబడినవారే. ఆ భవనమునంతయు ఒకటిగా నిలిపి, దానిని ప్రభువు నందు పవిత్ర దేవాలయముగా పెంపొందించువాడు క్రీస్తే. ఆయనతో ఏకత్వము వలన మీరును అందరితో కలిసి ఒక గృహముగా నిర్మించబడుచున్నారు. అందు దేవుడు తన ఆత్మ ద్వారా నివసించును (ఎఫెసీ 2,20-22)



# శోధన

**(గత సంచిక తరువాయి భాగం)**

గమనించండి, తస్మాత్ జాగ్రత్త! పరిశుద్ధాత్మ దేవుని నడిపింపు ఎప్పుడూ వాక్యానికి విరుద్ధంగా ఉండదు. అపవాధి ఏ కోణం నుండి శోధిస్తాడో గుర్తించడం చాలా కష్టం. గుర్తించే లోపు ఆహుతి అయిపోతాం. దేవునికి స్తోత్రం! మనకొక రక్షకుడున్నాడు. ఆయన అలాంటి శోధనలను కూడ గుర్తించి, ఎదురొడ్డి నిలబడ్డాడు. వాస్తవానికి యేసు క్రీస్తు ఎందుకు శోధింపబడాలి? ఆయన చాలా ప్రత్యేకమైనవాడు కదా! "నీ దేవున్ని శోధింపవలదు" అని వాక్యం చెబుతుంది కదా! ఆయన ఎందుకు శోధించబడాలి అంటే ఆయన మనలో మమేకమవ్వాలి. మనలో ఆయన ఒకడై పోవాలి. మనస్థానంలో ఆయన సిలువలో చనిపోవాలంటే మనపక్షంగా, సమస్త మానవాళి పక్షంగా, మానవాళి పాపాన్ని కడిగి వేయడానికి, తుడిచి వేయడానికి ఆయన మనలా మారిపోవాలి. నిజానికి జ్ఞానస్నానం ఎవరు తీసుకుంటారు? మారు మనస్సు పొందేవారు తీసుకుంటారు. మారు మనస్సు పొందటం అంటే ఏమిటి? తమ పాపాల గూర్చి పశ్చాత్తాపపడి, బాధపడి, లోకం వైపు నుండి, పాపం వైపు నుండి దేవుని వైపు తిరగడం, ఇక ఎన్నటికి పాపం వైపు చూడనని, చాలా తీవ్రమైన నిర్ణయం తీసుకోవడమే బప్తిస్మం. మరి ఎందుకు యేసు ప్రభు బాప్తిస్మం తీసుకున్నారు? ఆయన మనలాంటి వాడు కావాలి. అప్పుడే మన స్థానంలో నిలబడడానికి అర్హుడవుతాడు. ఆయన మానవుడిగా వచ్చి మనిషి యొక్క ప్రతి ఇబ్బందిని, పరిమితిని

అనుభవించాడని ఏలా తెలుస్తుంది? అందుకే ఇలా శోధింపబడవలసి వచ్చింది. హెబ్రీ పత్రిక 4వ అధ్యాయం 15వ వచనం చదవండి. దాని ప్రకారం మానవుడి యొక్క సమస్త విషయాలలో ఆయన సంపూర్ణ మానవునిగా మారిపోయారు. మనిషిగా మనం ఎదుర్కొంటున్న ప్రతీ శోధనను ఆయన ఎదురుకొన్నాడు అని గమనించాలి. మనం శోధన గుండా వెళ్ళినప్పుడు ఆయన మనలను అక్కున చేర్చుకోగలడు. ఎందుకంటే ఎల్లప్పుడు ఆయన మన మధ్యలోనే మనతోనే ఉన్నారు. మొదటి మానవుడైన ఆదాములో ముందు పాపస్వభావం లేదు. కాని పాపంలో పడ్డారు. తన చుట్టూ ఉన్న లోకంలో అసలు పాపమే లేదు. అయినా పాపంలో పడ్డాడు. కడపటి ఆదాము అయిన యేసు ప్రభు కళ్ళు తెరవగానే పాపపంకిలమైన లోకం దర్శనమిచ్చింది. చుట్టూ పాపమే. అయినా పాపంలో పడలేదు. కాని ప్రతీ శోధన గుండా వెళ్ళారు. అందుకే ఆయన మనకి ఆదర్శం. రోమా పత్రిక 5వ అధ్యాయం మరియు 18వ. వచనం మీకు ఇంకా బాగా అర్థం కావడానికి 3వ. అధ్యాయం చదవండి. మొదటి ఆదాము పాపము యొక్క పర్యవరసానంగా కష్టాలు, బాధలు, కన్నీళ్ళు, సమస్త దుర్నీతి, చివరికి మరణం మనుషులందరికి ఏలాగు సంక్రమించాయో అలాగే ఈ ఆదాము ద్వారా మనిషికి పాపమును జయించే సత్తా, పరలోక రాజ్యము సంక్రమించాయి. అందుకనే హెబ్రీ పత్రికలో వ్రాయబడినట్లు సమస్త విషయములలో ఆయన శోధన గుండా వెళ్ళవలసి వచ్చింది. శోధన గుండా మనం వెళ్ళినప్పుడు మన ధైర్యం ఏమిటంటే యేసు ప్రభు కూడ దాని ద్వారా వెళ్ళాడు కనుక ఆయన శక్తితో మనం ఆ శోధనలను జయించవచ్చును.

లూర్ధుస్వామి, బెల్లంపల్లి


**(తరువాయి భాగం వచ్చే సంచికలో)**

## శుభవచనం బైబిల్ క్విజ్‌లో పాల్గొనే వారందరికి శుభవార్త

2021 జనవరి నెల నుండి క్రొత్త సిరీస్‌ను ప్రారంభించాము.
మే, జూన్ నెలలలో మాసపత్రిక ప్రచురింపబడలేదు.

1. ప్రతి నెల అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి నుండి నెల చివరిలో లాటరీ తీసి దానిలో విజేతలకు బహుమతులు ఇవ్వబడుతాయి.
2. ప్రతి నెల క్రమం తప్పకుండా అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేరు మరియు మార్కులు వ్రాసి ఉంచుతాము. ఇలా అన్ని నెలలు క్రమం తప్పకుండా అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి నుండి సంవత్సరం చివరిలో లాటరీ తీసి దానిలో విజేతలకు బహుమతులు ఇవ్వబడుతాయి. మొదటి బహుమతి రూ॥ 10,000/–లు, రెండవ బహుమతి రూ॥ 8,000/–లు, మూడవ బహుమతి రూ. 6,000/– సంవత్సరములోని అన్ని పరీక్షలలో పాల్గొన్నవారికి ప్రోత్సహక బహుమతులు ఇవ్వబడుతాయి.

**మీరు ఈ గొప్ప అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాము.**




# యెరూషలేము ప్రయాణం
# మత్తయి 16,13-20,34

ఈ భాగంలో చాలా అంశాలున్నాయి. వీటిలో పేతురు విశ్వాస ప్రకటన, శిష్యసమాజ జీవితం అనే రెండు అతి ముఖ్యాంశాలు. ఇంకా ఇతరాంశాలు కూడా ఉన్నాయి. కనుక ఈ మూడింటిని క్రమంగా పరిశీలిద్దాం.

**1. విశ్వాస ప్రకటనం :** ఫిలిప్పు కైసరయ ప్రాంతంలో నేనెవరినని మీ అభిప్రాయం అని క్రీస్తు శిష్యులను అడిగాడు. నీవు దేవుని కుమారుడైన మెస్సీయావని పేతురు జవాబు చెప్పాడు. ఆ సంగతి పేతురికి ఎలా తెలిసింది? తండ్రే అతనికి ఈ దివ్య శ్రుతిని తెలియజేసాడు. ఈ మెస్సీయా కొరకే యూదులు శతాబ్దాల నుండి ఎదురు చూస్తున్నారు. మార్కు గ్రంథంలోలాగే మత్తయి సువిశేషంలో గూడ ఈ విశ్వాస ప్రకటనం కొండ శిఖరంలాంటిది.

ప్రభువు పేతురు విశ్వాసాన్ని మెచ్చుకొని అతనికి "కేఫా" అని పేరు పెట్టాడు. ఈ పేరుకు రాయి అని అర్థం. కేఫా అనే రాతిపై క్రీస్తు తన సమాజాన్ని ఓ భవనంలా నిర్మిస్తాడు. అనగా క్రైస్తవ సమాజానికి పేతురు తిరుగులేని పెద్ద, నాయకుడు ఔతాడని భావం. నిజమైన నాయకుడు క్రీస్తే. పేతురు అతని స్థానంలో ఉండే ఉపనాయకుడు. క్రీస్తు పేతురికి పరలోక రాజ్యపు తాళపు చెవులు అప్పచెప్పాడు. అనగా సర్వాధికారం ఇచ్చాడని భావం. పౌలు, ఇతర అపోస్తలులు పేతురు ప్రధానాధిపత్యాన్ని గుర్తించి గౌరవించారు. నేడు పాపుగారి ప్రధానాధి పత్యం పేతురు నుండి వచ్చిందే.

కాని ఇలా ప్రధానాధికారియైన పేతురే క్రీస్తుని సిలువ మార్గం నుండి తప్పింపచూచాడు. క్రీస్తు అతన్ని సైతాను వెనుకకు పో అని మందలించాడు - మత్తయి 16,23. నరులు ఎంత పెద్దపదవిలో ఉన్నా వారి బలహీనతలు తొలగిపోవు. కనుక శిష్యులు జాగ్రత్తగా మెలగాలి. లేకపోతే క్రీస్తు మార్గం నుండి వైదొలుగుతారు.

ఈ విశ్వాస ప్రకటనం తర్వాత యెరూషలేము ప్రయాణం ప్రారంభమౌతుంది. ఇప్పటి నుండి ప్రభువు తన మరణోత్థానాలను ప్రస్తావిస్తుంటాడు. ఇక మీదట సువిశేష కథంతా ఆ దిశలోనే నడుస్తుంటుంది. అతడు మూడుసార్లు శిష్యులకు ఈ మరణోత్థానాలను జ్ఞప్తికి తెచ్చాడు. మత్తయి 16,21. 17,22. 20,18. దివ్యవరూపధారణ ఘట్టం కూడ ఈ సందర్భానికి చెందిందే. ఇక్కడ క్రీస్తు ఒక్క క్షణకాలం పర్వతం మీద తన ఉత్థాన తేజస్సుని శిష్యులకు చూపించాడు. 17,2. ఎందుకు? క్రీస్తు శ్రమల కాలంలో శిష్యులకు నిరుత్సాహం కలుగుతుంది. వారు అతన్ని విడనాడతారు. ఆ సమయంలో వారికి ఓదార్పునీ, ధైర్యాన్నీ కలిగించడానికి ఈ దివ్యరూపధారణం ఉపయోగపడుతుంది. అతనిలో దివ్యశక్తి ఉందని గుర్తించి వారు ధైర్యం తెచ్చుకోవచ్చు.

**2. శిష్యసమాజ జీవితం :** 18వ అధ్యాయం ఈ సువిశేషంలో నాల్గవ పెద్ద ఉపన్యాసం. ఇది శిష్యసమాజ జీవితాన్ని వర్ణిస్తుంది. ఇక్కడ రెండంశాలు ముఖ్యం. మొదటిది, ఈ సమాజంలో ఎవరూ నాశమైపోకూడదు 18,1-14. ఈ సూత్రాన్ని విశదీకరించడానికి రచయిత తప్పిపోయిన గొర్రె సామెతను చెప్పాడు. సమాజంలోని పసివారు, పేదలు, బలహీనులైన సభ్యులు నాశమైపోకూడదు. కాపరి తప్పిపోయిన గొర్రెలాగే క్రైస్తవ నాయకులు సమాజం నుండి తప్పిపోయిన వారిని నెనరుతో వెదకి మళ్ళా మందలోనికి తీసుకరావాలి. శిష్యసమాజంలో గొప్ప వారికేకాదు, అల్పులకు కూడా విలువ ఉంది.

రెండవది, శిష్యసమాజంలోని వారు ఒకరి అపరాధాలనొకరు క్షమిస్తుండాలి- 18,15-35. ఈ సుత్రాన్ని వివరించడానికి రచయిత క్షమింపనొల్లని సేవకుని కథ చెప్పాడు. మనం తోడి వారిని క్షమించకపోతే దేవుడు మనలను క్షమించడు- 18,35. కనుక మనకు దీర్ఘకాలపు పగ, వైరం పనికిరావు.

ఇంకా శిష్యులు తమ తగాదాలను వారిలో వారే పరిష్కరించుకోవాలి- 18,15-17. అపరాధం చేసినవాన్ని మొదట వ్యక్తిగతంగా కలిసి కొని మందలించాలి. అతడు వినకపోతే సాక్షుల సాయంతో అతనికి బుద్ధి చెప్పాలి. అప్పుడు కూడ వినకపోతే సంఘ పెద్దల సాయంతో అతన్ని హెచ్చరించాలి. ఈ మూడు పద్ధతుల వల్ల కూడ దారికి రానివాన్ని సంఘం నుండి బహిష్కరించాలి. ఓ వైపు కరుణ మరోవైపు క్రమ శిక్షణ కూడ ఉండాలి. ఫలితాంశమేమిటంటే, శిష్య సమాజంలో ఒకరినొకరు పట్టించుకోవాలి. ఈ సమాజమే నేటి మన క్రైస్తవ సమాజం. మత్తయి తననాటి క్రైస్తవ సమాజాన్ని మనసులో పెట్టుకొనే ఈ అధ్యాయాన్ని రచించాడు.

**3. ఇతరాంశాలు :** ప్రభువు గలిలయ సీమను వీడి యూదయ రాష్ట్రంలోకి ప్రవేశించాడు- 19,1. యెరూషలేము త్రోవలో అతడు శిష్యులకు కొన్ని నైతిక సూత్రాలు బోధించాడు. వీటిని రచయిత 19-20 అధ్యాయాల్లో పేర్కొన్నాడు. అవే ఇవి

- భార్యాపరిత్యాగం పనికిరాదు. సృష్ట్యాదిలో ఆదామేవలు ఏకశరీరులు. అనగా వారిద్దరూ ఒకే వ్యక్తి అన్నంత సన్నిహితంగా కలిసిమెలసి జీవించారు. నేటి దంపతులకు గూడ ఇదే సూత్రం వర్తిస్తుంది.
- ధనిక యువకుని కథ చెప్పేదేమిటంటే, దైవరాజ్య ప్రవేశానికి ధనాశ పెద్ద ఆటంకంగా ఉంటుంది. ఒంటె సూది బెజ్జంలోనైనా దూరుతుంది గాని ధనికుడు దైవరాజ్యం చేరడం కష్టం. అన్నీ వదలి క్రీస్తుని అనుసరించిన శిష్యులకు దైవరాజ్యం బహుమతిగా లభిస్తుంది.
- ఐనా మోక్ష బహుమతి మన అర్హతను బట్టి, శ్రమను బట్టీ రాదు. కేవలం దేవుని కరుణను బట్టే వస్తుంది. అతడు చివరన వచ్చిన ద్రాక్షతోట కూలీలను కూడ నిండు వేతనం ఇచ్చిన కరుణామయుడు. అలాగే నేడు తన మంచితనాన్ని బట్టి మనకు మోక్ష బహుమతినిస్తాడు.
- జెబదాయి కుమారులైన యోహాను, యాకోబులు దైవరాజ్యంలో పెద్ద పదవులు కోరారు. శిష్యులకు కావలసింది పదవులు కాదు, సిలువను చేకొనడం. తోడి వారికి సేవలు చేయడం- 20,26. మన కొరకు ప్రాణాలర్పించి మహాసేవకుడైన క్రీస్తు మనకందరికీ ఆదర్శంగా ఉంటాడు- 20,28. నేడు తిరుసభ అధికారుల్లో ఈ సేవాగుణం లోపించడం శోచనీయం.

సశేషం....



**పునీత జాన్ కపిస్ర్తానో**
**(గురువు, వివిధ శ్రీసభ బాధ్యతలు నెరవేర్చిన వ్యక్తి, మతసాక్షి**
**(క్రీ॥శ॥ 1386-1456)**

దేవుడు చేసే పనులు మానవ మాత్రులకు అంతుచిక్కదు. అటువంటి కోవకు చెందిన జీవిత చరిత్రగలవారే పునీత జాన్ కపిస్ర్తానో. వారు క్రీ॥శ॥ 1386లో ఉద్భవించారు. వీరిది కాస్త కలవారి కుటుంబమే. జాన్‌గారు పెరూజియా పట్టణంలోని కళాశాలలో చదివి న్యాయశాస్త్రంలో మొదటి శ్రేణిలో పట్టాపుచ్చుకున్నారు. తమ 27వ ఏట వారు పెరూజియా పట్టణం గవర్నరుగా నియమితులయ్యారు. పరిశుద్ధ పోపుగారి పాలనలో గల భూభాగమది. అందుకే కొంతమంది అధికారుల్లో పేరుకు పోయిన అవినీతి జాఢ్యాన్ని వదలగొట్టారు. అన్యాయం అక్రమం అంటే కొరడా ఝుళిపించేవారు.

క్రీ॥శ॥ 1416లో మలటెస్టామండల పాలకులు పెరూజియాపై దండెత్తి వచ్చారు. యుద్ధం జరిగింది. ఆ సమయంలో జాన్ గారు శాంతి సంభాషణలకై మలటెస్టా వెళ్లారు. వారి సదుద్దేశాన్ని అపార్థం చేసుకున్న విద్రోహులు వారిని బంధించి బందీఖానాలో పడవేశారు. ఈ చీకటి కొట్లో బందీయైన జాన్‌గారు తమ ఆత్మసంబంధ పరిస్థితిపై తీవ్రంగా సింహావలో కనం చేశారు. అయితే పెద్ద మొత్తం ధనం చెల్లింపగా జాన్ గారు చెరసాల నుండి విడుదలయ్యారు. వారు చెరసాలలో ఒంటరిగా ఉండి తమ పాపాల విషయమై ఎంతో పశ్చాత్తాపం చెందారు. వారికి పునీత అస్సీసి ఫ్రాన్సీసు గారు దర్శనమయ్యారు తత్ఫలితంగా జాన్‌గారిలో పెనుమార్పు కలిగింది. ఈ లోక సంబంధమైన ఆశలు అవసరాలన్ని ఒక్కసారిగా త్యజించి పునీత ఫ్రాన్సీసు గారిని అనుసరించాలని దృఢంగా భావించారు.

జాన్ గారు చెరసాలలో వేయబడటానికి కొద్ది రోజులముందుగానే జాన్ గారికి ఒక పెరూజియన్ యువతి వివాహం జరిగింది. అయితే అప్పుడు వారికి కలిగిన విరక్తివల్ల తన వివాహాన్ని రద్దు చేయించుకొని ఆ సంబంధంను పరిసమాప్తి చేసుకున్నారు. అటుపిమ్మట వారు ఫ్రాన్సీస్కన్ సన్యాసుల సభలో ప్రవేశం సంపాదించారు. అప్పటికి వారి వయస్సు కేవలం 31 సం॥లు. ఆ సభాధిపతియైన పునీత సియెనా బెర్ణర్డీన్ గురువర్యుల అనర్గళ సందేశాలు జాన్‌గార్ని ముగ్దున్ని గావించేవి. ఆ ప్రధాన గురువు గారికి తానొక మంచి శిష్యుడుగా పేరొందారు. వీరికి తోడి శిష్యుడుగా మార్చెస్‌నగర పునీత జేమ్సుగారు ఉండేవారు. వారు కూడ తనవలె న్యాయశాస్త్రంలో విద్యగడించినవారే. వీరు జాన్‌గార్కి జీవితాంతం వరకు గట్టి మద్దతు దారుగా నిలచి వారి మిషనరీ జీవితం, ఫ్రాన్సీసు వారి సభలో మంచి సంస్కరణలు ప్రవేశ పెట్టడంలో మిక్కిలిగా తోడ్పడ్డారు.

పునీత బెర్నర్డీను గారి సువార్త ప్రచార ప్రయాణంలో పునీత జాన్ కపిస్ట్రానో గారు జతగా ఉండి 9 సం॥లు తమ సహాయ సహకారాలందించారు. అనంతరం క్రీ॥శ॥ 1425లో తమ 39వ ఏట వారు పవిత్ర గురుపట్టాభిషిక్తులయ్యారు. ఇక వారే స్వయంగా ఇటలీలోని ప్రధాన నగరాలలో పర్యటించి సువార్తా బోధలు చేయడం ప్రారంభించారు. వారు పెద్ద పెద్ద ప్రజాకూడళ్లలో ప్రభువు రక్షణ వాక్యాన్ని లోతైన భావాలతో బలంగా తమ కంచు కంఠంతో ధారాళంగా విన్పించేవారు. శ్రోతలు 20 లేక 30 వేల మంది ప్రోగవుతుండేవారు. వారు నిర్వహించే ప్రదక్షిణలో గురువులు విశ్వాసులు లౌకిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేవారు. ఆ ప్రదర్శన రోజున ఆ ప్రదేశ వ్యాపార పనులన్నీ స్థంభించిపోయేవి. ఉత్తర ఇటలీలోని బ్రెస్సియా నగరంలో వారు ప్రసంగించిన ఒక్కొక్క సమావేశానికి ఒక లక్షా 26 వేల మంది హాజరై నిశ్శబ్దంగా వారు ప్రభు ప్రబోధాన్ని ఆలకించారు. జాన్‌గారు చక్కని లాటిన్ సాహిత్యంలో ప్రసంగిస్తే దుబాసీలు ప్రజలకు అర్థమయ్యే గ్రామీణ భాషలో తర్జుమా చేసి విన్పించేవారు. జాన్ గారి సందేశ సమయంలో వేలాదిగా ప్రజలు అద్భుతంగా స్వస్థతలు, మేలులు పొంది క్రీస్తుకు సాక్షులుగా మారుతుండేవారు. ఆ విధంగా జాన్ గారి పేరు ప్రతిష్ఠలు దేశ విదేశాలకు ప్రాకాయి. ఒక సందర్భంలో వ్యాధిగ్రస్తుల కోరిక మేరకు వారి తలపై జాన్ గారు సిలువ గుర్తు వేయగా వారు స్వస్థత పొంది క్రైస్తవ వేదంలోకి ప్రవేశించడం విశేషం.

తమకు ఆదర్శంగా ఉన్న పునీత సియెనా బెర్నర్డీను గారివలె జాన్‌కపిస్ట్రానో గారు పవిత్ర యేసు నామ భక్తిని వ్యాపింపజేశారు. ఆ రోజుల్లో ప్రొటెస్టెంటుల ప్రభావం అధికం కాజొచ్చింది. ఫ్రెటిసెల్లి అనబడే ఒక వితండవాది దక్షిణ ఇటలీ, సిసిలీ ద్వీప ప్రదేశాల్లో క్రైస్తవ వేదంకు తన సొంత వ్యాఖ్యానాలతో అసలు సిద్ధాంతానికి వక్రభాష్యాలతో మతంలో కొంత అయోమయాన్ని సృష్టించాడు. ప్రజల్లో కలిగిన ఈ అయోమయాన్ని పరిష్కరించేందుకు పోపుగారు గురుశ్రీ జాన్ కపిస్ట్రాన్ గారిని విచారణ జరిపే సంధాన కర్తగా పంపించారు. జాన్ గారు వక్రభాష్యాల్ని సమర్ధంగా ఎదుర్కొని కతోలిక విశ్వాసంను నిలబెట్టారు. క్రీ॥శ॥ 1431లో వారు ఫ్రాన్సీసు వారి సభలో పరిశీలన బృందంలో ఒక ప్రధాన సలహా సభ్యునిగా ఏర్పాటు చేయబడ్డారు. క్రీ॥శ॥ 1439 నుండి జాన్ గారు పోపు గారి దూతగా అనేక విదేశాలకు పంపబడినారు. వరుసగా వచ్చిన నలుగురు పోపు గార్ల హయాముల్లో కూడ వారు ఆ గొప్ప పదవి నిర్వహించారు. పోపు గారి దూతగా వారు పాలస్తీనా, పోలెండు, ఫ్రాన్సు,

ఆస్ట్రియా మరియు బొహేమియా (చెకోస్లోవేకియా) దేశాల్లో దిగ్విజయంగా పర్యటించారు. ఫ్రాన్సులో పూర్ క్లేర్స్‌సభను సంస్కరిస్తున్న పునీత కొలెట్టెయమ్మగారిని కలిసి వారిని బహుగా ప్రోత్సహించారు. అలాగే ఆయా దేశాల్లో కతోలిక సిద్ధాంతానికి వ్యతిరేకంగా పుట్టుకొచ్చిన అనేక వితండవాదనలకు విరుగుడు సమాధానాలు, ప్రకటనలు గుప్పించి తప్పిపోయిన వారిని కతోలిక విశ్వాసంలోకి వచ్చేలా విశేష కృషి సల్పి పోపు గారి మన్ననలందుకున్నారు.

క్రీ॥శ॥ 1453లో కాన్‌స్టాంట్ నోపుల్ నగరాన్ని తరుష్కులు వశపరచుకొనగా జాన్ కపిస్ట్రానో గారు ప్రధాన పాత్ర నిర్వహించారు. క్రైస్తవ రాజులందరని భుజం తట్టిలేపి వారిని ఏకం చేయకలిగారు. శత్రువులు ఎదుర్కొనేలా చేసి విజయం సాధించి, వారి పాలన బడకుండ హంగరీని, యూరపునంతటిని కాపాడకలిగారు. మత యుద్ధాల్లో పాల్గొన్న క్రైస్తవ పోరాట యోధులకు అన్ని విధాల ప్రబోధ చేసి వారిని కార్యోన్ముఖులను గావించారు. తురుష్కులు అధిక సంఖ్యలో ఉండి, వారికి అనుకూల పరిస్థితులు ఎన్నో ఉన్నాగాని క్రైస్తవ సైన్యంకు హున్యాది యానస్ నాయకత్వం వహించగా జాన్‌గారు స్వయంగా వామపక్ష సైన్యాన్ని నడిపించారు. సిలువ స్వరూపాన్ని చాలా ఎత్తుకు పైకిలేపి చూపుతూ సైన్యంకు ధైర్యం నూరిపోశారు. బెల్‌గ్రేడులో జరిగిన ఆ ఘోరయుద్ధంలో దేవుని తోడ్పాటు వల్ల క్రైస్తవ సైన్యం గొప్ప విజయం చేజిక్కించుకుంది. ఈ విజయం పిమ్మట వారు కేవలం మూడు మాసాలు మాత్రమే జీవించి ఉన్నారు.

పునీత జాన్ కపిస్ట్రానో గారు ఆ దినాల్లో విజృంభించిన సమస్యాత్మాక విషయాల్లో కలగ జేసుకొని సరిదిద్ద గలిగారు. తమ ఉపన్యాసాలతో, ప్రభు వాక్యంతో, తన వ్రాత పూతలతో తమలోను, శ్రీ సభలోను మంచి నాయకుడుగా ఉన్నత స్థానంబడశారు. వారు ఆస్ట్రియా దేశంలోని విల్లచ్ పట్టణంలో 1456 అక్టోబరు 23వ తేదీన శాశ్వతంగా ప్రభువు నందు నిద్రించారు. వారు క్రీ॥శ॥ 1960లో 8వ అలెగ్జాండరు పోపు గారిచే పునీతులుగా ప్రకటింపబడి యావత్ శ్రీసభచే కొనియాడ బడుచున్నారు.

**ధ్యానాంశం:**

నీ మరణం వరకు కలిగి ఉండు. నేను నీకు జీవ కిరీటాన్ని ప్రసాదిస్తాను.

---

**"ప్రభూ! నేను నీకు ప్రార్థన చేయుచున్నాను. నేను నిన్ను నమ్మితిని. నా విరోధులు నా పతనము చూచి సంతసింపకుండునట్లు చేయుము.**

**వారి వలన నేను అవహేళనకు గురికాకుండునట్లు చేయుము.**

**(కీర్తన 25,1-2)**

# శుభవచనం బైబిల్ క్విజ్

**యెషయా గ్రంథము 23-44 అధ్యాయాలు**

పేరు ..........................ఇంటి పేరు......................విచారణ ...........................

ఫోన్ నెంబర్...............................

## I. క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి

1) యెరూషలేము ప్రజలను దేవుడు ఎలా కాపాడెను?

2) రబ్షాకేహ లేచి నిలుచుండి జనులందరు వినునట్లు ఏ భాషలో పెద్దగా పల్కెను?

3) నీవు నా దుఃఖమున ఎలా మార్చుదువు?

4) ఎడారిలో ఏ చెట్లు నాటుదురు?

5) దిడీలున ప్రభువు ఎవరిని ఆదుకొనును?

6)................................................................... వారు లేడివలె గంతులు వేయుదురు.

7) ఆ నిప్పు ................................................................... దహించెను.

8) మీరు నాకు ............................................................ .

9) అతడు ................................. పై నున్న .......................... మీద ఆసీనుడై యుండును.

10) ఇస్రాయేలు దేవుని ................................................. గాంచెదరు.

11) ...................................... చీకు చింత లేకుండా శాంతి సమాధానములతో జీవింతురు.

12) .................................................... సమతలము కావలెను.

13) నేను నిన్ను ........................................................................................ నిన్ను సన్మానింతును.

14) ............................................................................................................ సృజించినవాడవు నీవే.

15) ........................................................................................... లోయ ఎండి యెడారి ఐనది.

16) మీరు సదా ........................................... నమ్ముడు. అతడు మనకు శాశ్వతమైన ..................................

17) ఈ ప్రజలు దేవుని మీద తిరుగుబాటు చేయు వారు, ...................................................., ప్రభువు సందేశమును వినని వారు.

18) ఆ ప్రాణులా ........................................................................... చేసికొని కలకాలమచట వసించును.

19) రాజతనితో వీరు దూర దేశమైన ............................................................... నుండి వచ్చిరని చెప్పెను.

20) ప్రభువునైన నేను నిన్ను ............................................................................................... .

21) నీవు నేను ................................................................................................... కాపరివి.

22) ప్రభూ! నీవే నాకు .......................................................................................................... .

23) నీవు నా స్నేహితుడైన .................................................................................... వంశజుడవు.

24) నీవు నా ........................................................................................ జ్ఞప్తియందుంచుకొనుము.


25) వారు యెరూషలేమున ................................................................ పై ప్రభువు నారాధింతురు.

**శుభవచనం బైబిల్ క్విజ్ జవాబు పత్రాన్ని విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలో గానీ అక్టోబరు నెల 25వ తేదీలోపు మాకు పంపించాలి.**

**వచ్చే నెల పాఠ్యాంశం: యెషయా గ్రంథము 43 – 66 అధ్యాయాలు**

# ఇంద్రధనుస్సు

"ధనవంతుడు దేవుని రాజ్యమున ప్రవేశించుట కంటె, ఒంటె సూది బెజ్జములో దూరిపోవుట సులభతరము" (మత్తయి19,24) అనే సువార్త సందేశమును తెలిపే ఈ చిత్రాన్ని రంగులమయం చేద్దాం.



**పేరు:...................................వయస్సు........తరగతి........స్థలం.................**

**సూచన :**

1. కేవలం 15 సం॥ల లోపు పిల్లలే ఈ పోటీలో పాల్గొనాలి.
2. రంగులు నింపిన చిత్రాన్ని మీ విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలోగానీ అక్టోబరు నెల 25వ తేదీలోపు మాకు పంపించాలి.



# "పిల్లలూ! యేసయ్య మిమ్ములను పిలుస్తున్నాడు"

**ప్రియమైన చిన్ని బిడ్డలారా!**

అక్టోబర్ నెల జపమాల మాత మాసం. మరియ మాతకు అతి ఇష్టమైన మంగళవార్తను భక్తి ప్రపత్తులతో ప్రార్థించిన స్థలంలో సాతాను పారి పోతుంది. యేసయ్యా జనన శుభవార్త రక్షణ మంగళవార్త శుభవార్త స్వీకరించబడుతుంది.

"హృదయ శుద్ధి కలవారు ధన్యులు వారు దేవుని దర్శింతురు" (మత్తాయి 5,8). మనం ఈ నెల 4వ తేదీన పునీత ఫ్రాన్సిస్ అసిసి వారి పండుగను కొనియాడుతున్నాము. ఫ్రాన్సిస్ గారిని అపర క్రీస్తు అని కూడ పిలుస్తారు. రక్షకుడైన యేసు సిలువపై నిరూపించిన ఆ త్యాగ ప్రేమను ధ్యానిస్తూ పంచగాయాలను పొందిన పుణ్య తండ్రి ఫ్రాన్సిసు గారు. వీరు ప్రపంచమంతా ఒక కుటుంబం తండ్రి దేవుడే విశ్వకుటుంబానికి తండ్రి. ఈ ప్రపంచంలో సృష్టిలోని ప్రతి జీవిని వస్తువులను సూర్యుడు సోదరుడని చంద్రుని సోదరిని ప్రతి జీవిని సోదరి సోదరులుగా భావించి గౌరవించారు. ఆయన హృదయాంతరాగం నుండి వెలువడిన ప్రార్థన ప్రభువా నన్ను శాంతి సాధనముగా మార్చుము అంటూ వారు చేసిన ప్రార్థనను మనం కూడా జపిద్దాం

**ద్వేషమున్న చోట ప్రేమను**

**అవిశ్వాసమున్న చోట విశ్వాసమును**

**నిరాశ ఉన్న చోట ఆశను**

**చీకటియున్నచోట నీ కాంతిని చూపనిమ్ము ప్రభూ!**



# యేసు మరియు యువతకు మధ్య ఉన్న అనుబంధం

ఈ ఆధునికి కాలంలో ప్రతి ఒక్కరు ఏదో సాధించాలని, తమ కంటు ఒక ప్రత్యేకత ప్రాముఖ్యత ఉండాలని, అందరికంటే గొప్పగా, ఉన్నత స్థాయిలో జీవించాలని, మరి ముఖ్యంగా ఒక విశిష్ట వ్యక్తిగా జీవించాలని ఎంతో మంది ప్రాయస పడుతున్నారు. మరి క్రైస్తవులైనటువంటి మనం ఈ యవ్వనదశలో దేని కోసం, ప్రాయసపడుతున్నాము. ఆరాట పడుతున్నాము. యువకులందరి వలె విందులు, వినోదాలతో, ఈ లోక ఆశలకు బానిసలై జీవిస్తున్నామా? లేదా విశిష్ట వ్యక్తులుగా జీవిస్తున్నామా? మన కంటు ఒక ప్రత్యేకత ప్రాముఖ్యత ఉందా? క్రైస్తవ యువకులైనటువంటి మనకు యేసు ప్రభుకు మధ్య ఉన్న అనుబంధం ఎలా ఉండాలి అని ఆత్మ పరిశీలన గావించుకుందాం.

## 1. క్రీస్తుతో స్నేహం

"ఇక మీదట నేను మిమ్ములను దాసులని పిలువక, స్నేహితులని పిలిచెదను" (యోహాను 15,15) అన్న వాక్యాలు యేసు ప్రభువే స్వయంగా పలికియున్నాడు. 'స్నేహితుడు' అన్న పదానికి అర్థం తనకున్నదంతయు తన స్నేహితునితో పంచుకోవడం, మరిముఖ్యంగా కష్టంలో, దు:ఖంలోనైన, సంతోషంలోనైనను సర్వదా మీతో (స్నేహితునితో) ఉంటానని అర్థం. పైన పేర్కొన్న లక్షణాలన్ని మన ప్రభువగు యేసు క్రీసులో ఉన్నవే అని మనం జ్ఞాపకం చేసుకోవాలి. ఇదిగో లోకాంతము వరకు సర్వదా నేను మీతో నుందును అని అభయమొసగెను. (మత్తయి 28,20). దీని అర్థం ఏమిటంటే, మన అనుదిన జీవితంలో ఎన్ని కష్టాలు, బాధలు, ఇబ్బందులు

ఎదురైనప్పటికి ఒక ప్రాణ స్నేహితుడుగా నేను మీతో ఉండి సహాయం చేస్తానని సెలవిచ్చాడు. మనం సంతోషపడవలసిన విషయం ఏమిటంటే క్రీస్తు మనకు స్నేహితుడు కావడం ఇది మన భాగ్యం మరియు దేవుడిచ్చిన గొప్పవరం.

క్రీస్తుతో అనుబంధాన్ని పెంపొందించుకోవడానికి కావలసిన లక్షణాలు:

- క్రీస్తు జీవిత విధానాన్ని అనుసరించాలి
- క్రీస్తు బోధనలను పాటించాలి
- క్రీస్తు నడిచిన బాటలో (మార్గంలో) నడవాలి.

**2. తోటి నరుని పట్ల ప్రేమ:**


మనం ఎప్పుడైతే దేవుని ప్రేమను సంపూర్ణంగా పొందియుంటావో అప్పుడే తోటినరులపట్ల ప్రేమ చూపించగలము. ఎవరైనను తాను దేవుని ప్రేమింతునని చెప్పుకొనుచు తన సోదరుని ద్వేషించినచో అట్టివాడు అసత్యవాది తన కన్నులారా తాను చూచిన సోదరుని ప్రేమింపనిచో తాను చూడని దేవుని అతడు ప్రేమింపలేడు. కనుక దేవుని ప్రేమించువాడు తన సోదరుని కూడ ప్రేమింపవలెను అనుదినదియే క్రీస్తు మనకు ఒసగిన ఆజ్ఞ (1 యోహాను 4,20-21). ఈ ఆజ్ఞను మనం తు.చ. తప్పకుండా పాటిస్తేనే యేసు ప్రభుకు మనకు అనుబంధం ఉంది అని అర్థం.


యేసు ప్రభువు యువత నుండి కోరుకునే ప్రేమ ఒకటైతే యువత కోరుకునే ప్రేమ మరొకటి. యవ్వనస్తులు కోరుకునే ప్రేమలో విందులు, వినోదాలు మరియు ఈ లోక ఆశలను తీర్చుకోవాలనేది మాత్రమే. ప్రతి యొక్క యువతి యువకులు గుర్తుంచుకోవల్సింది ఏమిటంటే వృక్షం ప్రతి యేట ఎలాగైతే వికసించి, పుష్పాలతో పరిమళిస్తుందో అలాగే మనం ఉన్న చోట ఆ ప్రదేశాన్ని పరిమళంతో వెదజాల్లాలి. మన ఆలోచనలను ఆనందాన్ని, ఆశయాలకలలను, నలుగురితో పంచుకొని, తోటి నరులపట్ల, ప్రేమ అప్యాయత, జాలి, కరుణ వంటి సుగుణాలను యేసు ప్రభు చూపించినట్లు క్రైస్తవ బిడ్డలమైన మనం కూడా ఈ సుగుణాలను తు.చ. తప్పకుండా పాటిస్తే యేసు ప్రభుకి మనకు అనుబంధం ఉంది అని ఇతరులు అర్థం చేసుకుంటారు.

కనుక ప్రియ స్నేహితులారా! మనం క్రీస్తుతో స్నేహంగా గుడుపుతూ, తోటివారి పట్ల ప్రేమ, అప్యాయత మంచితనం అనే సుగుణాలను అలవర్చుకొని, మంచి యువకులుగా, పరిశుద్ధ జీవితము గడుపుతూ, దేవునికి ప్రీతికరమైన బిడ్డలుగా జీవిద్దాం.

**నా రక్షకుడవైన ప్రభూ!**
**నేను నీకు**
**మొరపెట్టుచున్నాను,**
**నన్నాదుకొనుము.**
**నేను ఆపదలో ఉన్నపుడు**
**నీవు నన్ను కాపాడితివి.**
**కనుక ఇపుడు కరుణతో**
**నా వేడుకోలు**
**ఆలింపుము.**
**(కీర్తన 4,1)**

# బైబిల్ దృశ్యమాలిక


ఏడు సంవత్సరాలు ధాన్యం విపరీతంగా పండింది.
సగం ధాన్యం ధాన్యాగారంలో దాచాడు యోసేపు.
యోసేపు - ఆసినాతు అనే యువతిని పెళ్ళి చేసుకున్నాడు.
!!
యోసేపు కొత్త రాజ మందిరం నీకు వివాహ బహుమతిగా ఇస్తున్నాను.



తరువాత
ఏడేండ్లు వర్షాలే లేవు
మాకు ఆహారం కావాలి. కరువు నుండి మమ్ము కాపాడండి
యోసేపు దగ్గరకు వెళ్ళండి.
కానాను దేశంలో కూడా కరువు వచ్చింది - యాకోబు తన కుమారులను ఐగుప్తుకి పంపాడు. యోసేపు వారిని గుర్తించాడు. వారు యోసేపుని గుర్తించలేదు
మీరు మా దేశ రహస్యాలు తెలుసుకునే గూఢా చారులా?
!!
ప్రభూ! పేద హెబ్రూలం. 12 మంది అన్నదమ్ములం.

# శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు

**యెషయా గ్రంథము 1- 22 అధ్యాయాలు**

1) భుజముల మీద (22,22)

2) దీవెనగా (19,24)

3) రక్షకుడు, భయమును (12,2)

4) న్యాయమును (16,5)

5) శిశువు, కుమారుని (9,6)

6) శత్రువులను (1,24)

7) వెలుగైన (10,17)

8) దమస్కు (7,8)

9) పీడితులను, అనాథ శిశువులకు (1,17)

10) ఉన్నతుడగును (2,17-18)

11) ఇశ్రాయేలు (10,20)

12) పవిత్ర ప్రజ (6,13)

13) విజ్ఞానమును, వివేకమును (11,2)

14) రోజు (13,9)

15) కర్తయైన దేవుని (17,10)

16) సర్వశక్తిమంతుడైన (18,7)

17) దిగంబరుడుగా (20,2)

18) తేజస్సు (4,6)

19) తెలివి కల వారినిగాను, బుద్ధిమంతులనుగా (5,21)

20) దమస్కునకు (7,8)

21) దుర్మార్గులను (11,4)

22) అతి పేదలకు (14,30)

23) బాసటగా (8,10)

24) మీ బలులు (1,13)

25) ప్రభువు (5,7)

**వచ్చే నెల పాఠ్యాంశం: యెషయా గ్రంథము 43-66 అధ్యాయాలు**

# శుభాకాంక్షలు అందించండి



**జన్మదినం, వివాహము, వివాహ వార్షికోత్సవ, విచారణ పండుగలను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేయాలనుకునేవారికి ఇదొక సదావకాశం. మీరు మీ ఫోటోను, ప్రచురించవలసిన వార్తను పంపించినట్లయితే మేము మీ తరుపున ఈ మాసపత్రికలో శుభాకాంక్షలు ప్రచురిస్తాము.**

బ్లాక్ & వైట్ ఫుల్ పేజీ రూ. 1000/-

బ్లాక్ & వైట్ ఆఫ్ పేజీ రూ. 500/-

బ్లాక్ & వైట్ క్వాటర్ పేజీ రూ. 250/-

ఈ సదావకాశమును వినియోగించుకొని మీ కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు తెలియజేయండి.

**వివరాలకు సంప్రదించండి**

9440874028

**రచయితలారా, గమనించండి ! వెంటనే రచనలు పంపండి!**

ఆధ్యాత్మిక స్ఫూర్తినిచ్చే రచనలు, కథానికలు, కవితలు, పిల్లల కథలు, మన విశ్వాసం గురించిన వివిధ అంశాలపై సామాజిక స్ఫూర్తినిచ్చే రచనలు వెంటనే పంపండి. **మీ రచనలు ప్రతినెల 12వ తేదిలోగా చేరాలి.** అలస్యంగా వచ్చే రచనలు పరిశీలింపబడవు.

**వివరాలకు సంప్రదించండి**

9398764408

**ఈ పత్రికను పొందాలనుకునే వారు మీ వివరాలు, అడ్రస్ మాకు పంపించండి**

**వార్షిక చందా 120 రూ॥లు**

**మా అడ్రస్**

**జీవస్వరం**

బిషప్స్ హౌస్, మంచిర్యాల - 504 208

మంచిర్యాల జిల్లా, తెలంగాణ

Cell : 9398764408, e-mail : jeevaswarammagazineadb@gmail.com

## నూతనంగా నిర్మింపబడి ప్రతిష్ఠించబడిన సేయింట్ సెబాస్టియన్ దేవాలయం, డోంగ్రగావ్








## నూతనంగా పునర్నిర్మింపబడి ప్రతిష్ఠించబడిన సెయింట్ మేరిస్ దేవాలయం, వడాల








# జీవస్వరం ప్రార్థన బృందం

ప్రియ విశ్వాసులారా ప్రతి రోజు మీ కోసం 24 గం॥లు ప్రార్థన చేసే ప్రార్థనా సైనికులు సిద్ధంగా ఉన్నారు. నిత్యం మీ కొరకు మధ్యస్థ ప్రార్థనలు వారు చేస్తారు. ప్రార్థన సహాయం కొరకు మీరు సంప్రదించవలసిన నెంబరు

**8501975250**

ఈ నెంబరుకు ఫోన్ చేసి మీ విన్నపాలను, అవసరాలను మాకు తెలియపరచండి. మా ప్రార్థనా యోధులు మీకోసం మోకరించి ప్రభువుతో ప్రార్థిస్తారు. అదే విధంగా బైబిల్ గురించి తెలుసుకోవాలనే ఆసక్తి గలవారు కూడా ఈ నెంబరును సంప్రదించగలరు.

మీ జీవిత గమనములోని ఆటంకములు, బాధలు, అనారోగ్యములను ఎదుర్కొనే శక్తిని, ప్రభునందు భక్తిని, విశ్వాసాన్ని పెంపొందించుకొనుటకు ఆదిలాబాద్ గురుపీఠ జీవస్వరం ప్రార్థన యోధులు **మీ కోసం 24 గంటలు ప్రార్థించుటకు సిద్ధముగా ఉన్నారు.**

# జీవస్వరం సువార్త కూటము కొరకు ప్రార్థన

సర్వశక్తి మంతుడైన దేవా, మీకే ఆరాధన, స్తుతి, స్తోత్రము. "నేనే మార్గమును సత్యమును జీవమును" అని పలికిన ప్రభువా, మీ పవిత్ర మార్గములో నడిచి, సత్యమైన మిమ్ము తెలుసుకొని, మీ జీవమును పొందే ఆశీర్వాదం మాకు దయచేయండి.

జీవమునిచ్చుటకును దానిని సమృద్ధిగా ఇచ్చుటకును వచ్చిన దేవా, మీరిచ్చిన జీవమును సమృద్ధిగా పొందుటకు ఆదిలాబాదు గురుపీఠ దైవ ప్రజలకోసం మీరు ఏర్పాటు చేసిన "జీవస్వరం సువార్త స్వస్థత కూటము" ను బట్టి మేము మీకు వేలాది స్తోత్రములు చెల్లిస్తున్నాము. గురుపీఠ నలుమూలల నుండి మీ జీవస్వరమును ఆలకించుటకు వేలాది మందిని సమావేశపరచండి. మీ చిత్తానుసారంగా వాక్యమును బోధించుటకు వాక్యోపదేశకులను పవిత్రాత్మ శక్తిచే అభిషేకించండి. ఆత్మయు జీవమునైన మీ మాటలు మా గురుపీఠమంతటా వ్యాపింప చేయడానికి మేము చేస్తున్న ప్రయత్నాలను ఆశీర్వదించండి.

గలిలీయ సరస్సులో గాలిని అణచిన మీ వాక్కు, మరణించిన లాజరును జీవముతో లేపిన మీ వాక్కు, నీటిని ద్రాక్షారసముగా మార్చిన మీ వాక్కు, రోగులకు స్వస్థతనిచ్చిన మీ వాక్కు, పాపులకు క్షమాపణనిచ్చిన మీ వాక్కు జీవస్వరం కూటములో పాల్గొనే ప్రతి ఒక్కరిని పవిత్రీకరించి, బలపరచి, స్వస్థపరచును గాక. మీ పవిత్ర నామమునకు మహిమ కలిగే విధంగా జీవస్వరం సువార్తా కూటములో అద్భుతములు, స్వస్థతలు ధారాళంగా జరుగును గాక! ఆమేన్.

1 పర. 1 మంగళ. 1 త్రిత్వ.

ముద్రించు వారు : ఆదిలాబాద్ మేత్రాసన సువార్త విభాగం

For Private Circulation Only